యుద్ధప్రాతిపదికన నిమజ్జన వ్యర్థాల తొలగింపు



అంబర్‌పేటలో వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులకు సూచనలు చేస్తున్న డా. హేమాలత

అంబర్‌పేట: గణేశ్ నిమజ్జనంతో రోడ్లన్నీ చెత్తమయంగా మారాయి. మంగళవారం జరిగిన నిమజ్జన ఉత్సవంతో బుధవారం రోడ్లు నిమజ్జన కార్యక్రమం మిగిల్చిన సందడి రోడ్లపై కనబడింది. అంబర్‌పేట నియోజకవర్గంలోని సీపీఎల్ రోడ్, రామంతాపూర్, ఛే నంబర్, తిలక్‌నగర్, బర్కత్‌పూర, నారాయణగూడ, హిమాయత్‌నగర్ ప్రధాన రోడ్లలో ఊరేగింపు జరిగింది. పూలు, కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్లన్నీ నిండిపోయాయి. జీహెచ్ఎంసీ సర్కిల్‌-16 ఏఎంహెచ్‌వో ఉదయాన్నే తామ సిబ్బందితో రంగంలోకి దిగారు. ఎక్కడికక్కడ పారిశుద్ధ్య బృందాలు రోడ్లపై పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపులో నిమగ్నమయ్యాయి.

100 టన్నులు అధికం...

అంబర్‌పేట సర్కిల్ పరిధిలో నిత్యం 230 నుంచి 240 టన్నుల చెత్తను సేకరించేవారు. గణేశ్ నిమజ్జనంతో టన్నుల కొద్ది చెత్త పెరిగింది. మంగళవారం 280 టన్నుల చెత్త తొలగించగా బుధవారం 320 వరకు టన్నుల చెత్తను రోడ్లపై నుంచి తొలగించినట్లు ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమాలత తెలిపారు. అంతర్గత రోడ్లు, ప్రధాన రోడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి యథాస్థితికి తెస్తున్నట్లు చెప్పారు.

ట్యాంక్‌బండ్‌పై కొనసాగిన నిమజ్జనాలు



ట్యాంక్‌బండ్‌పై మధ్యాహ్నం వరకు వేచి ఉన్న గణనాథులు



రోడ్డుపై తెగిపడ్డ హైటెన్షన్ విద్యుత్ వైర్

కవాడిగూడ: గణపతి నిమజ్జనాలు ట్యాంక్‌బండ్‌పై బుధవారం మధ్యాహ్నం వరకు కొనసాగాయి. మంగళవారం ఉదయం 8గంటల నుంచి బుధవారం మధ్యాహ్నం 2గంటల వరకు ట్యాంక్‌బండ్‌లో 4390 గణపతి విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ట్యాంక్‌బండ్‌పైకి వందలాది విగ్రహాలు తరలిరావడంతో పరిసర ప్రాంతాలలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతేడాది వినాయక నిమజ్జనం కోసం ట్యాంక్‌బండ్‌పై 19 క్రేన్‌లను ఏర్పాటు చేయగా ఈసారి 15 క్రేన్‌లను ఏర్పాటు చేయడంతో నిమజ్జనం ఆలస్యం అయ్యిందని మండప నిర్వాహకులు పేర్కొన్నారు.

తెగిన విద్యుత్ వైర్... తప్పిన ప్రమాదం.!

లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ దేవాలయం, డాక్టర బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల మధ్యలోని ప్రధాన రోడ్డుపై హైటెన్షన్ విద్యుత్ వైర్ తెగిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను మళ్లించారు.

విజయవంతం.. గణేశ్ నిమజ్జనం

● అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్



అంబర్‌పేట: గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగిందని ప్రజల సహకారంతో విజయవంతంగా నిమజ్జన ఘట్టాన్ని పూర్తి చేశామని అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్ పేర్కొన్నారు. బుధవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ... ఠాణా పరిధిలో దాదాపు 500కు పైగా గణేశ్ మండపాలను ఏర్పాటు చేసుకొని ఉత్సవాలను నిర్వహించుకున్నారని అన్నారు. మండప నిర్వాహకులతో తాము సమన్వయం చేసుకుంటూ నిమజ్జనాన్ని విజయవంతం చేశామన్నారు. చెదురుముదురు సంఘటనలు మినహా నిమజ్జనం ప్రశాంతంగా సాగిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తాము సిబ్బందితో కలిసి అప్రమత్తంగా బందోబస్తును చేపట్టామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన నిమజ్జాన కార్యక్రమంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.

బొమ్మ మహేష్‌గౌడ్ సన్మాన సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలగౌనీ బాలరాజుగౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన బొమ్మ మహేష్‌గౌడ్ సన్మాన సభను విజయవంతం చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఓబీసీ ఎంపీల ఫోరం కన్వీనర్ వి.హనుమంతరావు ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన జరిగే రవీంద్రభారతీలో సన్మాన సభలో బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకావాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కమిటీ చైర్మన్ బాలగౌనీ బాలరాజుగౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం బీఆర్‌ఎస్ మాట్లాడటం విడ్డూరం

కారోబార్ అండ్ సిబ్బంది అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న వంగా రవీందర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల కోసం బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం విడ్డూరం అని గ్రామ పంచాయతీ కారోబార్ అండ్ సిబ్బంది అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వంగా రవీందర్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రామ పంచాయతీ కారోబార్ సిబ్బంది జీతాలు పెంచాలని సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మండల ఇన్‌చార్జీలకు నియామక పత్రాలను అందజేశారు.

గత ప్రభుత్వంలో జీతాలు పెండింగ్‌లో ఉండేవి...

అనంతరం ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ పాలనలో గ్రామ పంచాయతీ కారోబార్ సిబ్బంది జీతాలు 10 నుంచి 12 నెలల వరకు పెండింగ్‌లో ఉండేవన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ప్రత్యేక చొరవ చూపి రూ.150కోట్లు కేటాయించి పెండింగ్ జీతాలు ఇచ్చారని తెలిపారు. గత పదేళ్లలో మాజీ మంత్రి హరీష్‌రావుని ఎన్నిసార్లు కలిసి విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు హరీష్‌రావు గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల కోసం తమ తరపున మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హరీష్‌రావు మోసపూరిత మాటలకు తాము మోసపోమని తెలిపారు. ఇకనైనా రెచ్చగొట్టే మాటలు మానుకోవాలని హితువు పలికారు.

పండగలను కలసిమెలసి జరుపుకోవాలి



బోనాల అదనపు చెక్కును అందజేస్తున్న అరవింద్‌కుమార్

చిక్కడపల్లి: పండుగలు పర్వదినాలను కలసిమెలసి జరుపుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. బోనాల ఉత్సవాల అదనపు చెక్కు జవహర్ నగర్‌లోని ఉప్పలమ్మ దేవాలయ నిర్వాహకుడు గుండు జగదీశ్‌బాబుకు బోనాల చెక్కును బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బి. నవీన్‌కుమార్, సాయి సంకీర్త్ బాబ్జి, మారిశెట్టి నర్సింగ్‌రావు, బాబురావు, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో మంజూరు అయినందుకు ఆయన కృతజ్ఞలు తెలిపారు.

మేదరి వృత్తిదారులకు ఉచితంగా వెదురు ఇవ్వాలి



ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేపీ మురళీకృష్ణ

కాచిగూడ: మేదరి వృత్తిదారులకు వెదురును ఉచితంగా సరఫరా చేసే విధంగా ప్రభుత్వం తగు ఏర్పాట్లు చేయాలని మేదర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బాంబు ఫెడరేషన్ సలహాదారులు కేపీ మురళీకృష్ణ అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా బుధవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... 50 ఏళ్లు దాటిన మేదరి వృత్తిదారులకు ప్రభుత్వం పెన్షన్ ఇవ్వాలన్నారు. వృత్తి నైపుణ్యం శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి సబ్సిడీ లోన్‌లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుట్ట యాదగిరి, జోర్రిగల శ్రీధర్, పాతకోటి అంజయ్య, పాతకోటి మహేష్, వెంకటేష్, నర్సింహా, శేఖర్, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'రైజింగ్ విత్ కైండ్‌నెస్ యూత్ సమ్మిట్'

బంజారాహిల్స్: 'రైజింగ్ విత్ కైండ్‌నెస్ యూత్ సమ్మిట్'ను ఈ నెల 19 నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. కామన్వెల్త్ సహకారంతో జరిగే ఈ శిఖరాగ్ర సదస్సు రెండో ఎడిషన్‌ను హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా తాజ్‌కృష్ణా హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, హార్ట్‌ఫుల్‌నెస్ యూత్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ నివేదిత శ్రేయాన్స్‌లు మాట్లాడారు.

డీమ్డ్ యూనివర్సిటీల హోదాను రద్దు చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీలకు డీమ్డ్ యూనివర్సిటీల హోదాను తక్షణమే రద్దు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహకు బీసీ విద్యార్థులు వినతి పత్రాన్ని సమర్పించారు. బుధవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ ఆధ్వర్యంలో సచివాలయంలో మంత్రిని కలిసి విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న డీమ్డ్ యూనివర్సిటీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగుల రిజర్వేషన్లు అమలు చేయకుండా కేవలం ధనవంతులకు మాత్రమే వైద్యం, విద్య అందుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే డీమ్డ్ యూనివర్సిటీల హోదాను రద్దు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో వినోద్, బాలరాజు, మహేశ్ తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్ ప్రైవేట్ మోటర్ డ్రైవర్స్ అండ్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈ నెల 22,23 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు యూనియర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమర్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా మహాసభల గోడ పత్రికను కార్యదర్శి లతీఫ్‌తో కలిసి ఆవిష్కరించారు. యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల మహాసభలో భాగంగా తొలి రోజులైన 22వ తేదీన భారీ ప్రదర్శన బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. రెండో రోజు 23వ తేదీన ప్రతినిధుల మహాసభ జరుగుతుందని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.సాంబశివరావు, వీఎస్ బోస్, రాష్ట్ర అధ్యక్షులు జమాలయ, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం పాల్గొన్నారు.

మహాభాగ్యనగర్ బ్రాహ్మణసేవా సమితి నూతన కార్యవర్గం



అంబర్‌పేట: మహాభాగ్యనగర బ్రాహ్మణసేవా సమితి నూతన కార్యవర్గం ఎన్నికయ్యింది. బుధవారం గోల్నాకలో నిర్వహించిన సేవా సమితి సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహాదేవభట్ల లక్ష్మణప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా యలమంచి రామకృష్ణశర్మ, కోశాధికారిగా మధునూరి మహాదేవశర్మ, కన్వీనర్‌గా సిరిసిల్ల రామశర్మ, కార్యనిర్వహాక కార్యదర్శిగా యలమంచి చంద్రశేఖర్‌శర్మ, ఉపాధ్యక్షులుగా దామోర సత్యనారాయణశర్మ, ఘణపూరం రామ్‌ప్రసాద్‌శర్మ, వడ్డచెర్ల విష్ణుమూర్తి శర్మ, ఉప కార్యదర్శులుగా సీహెచ్ భవానీ, జోషి సత్యనారాయణ, త్రివేణి, రాజానాల వెంకటేశ్వరశర్మ, నిమ్మని స్వప్న, కార్యవర్గ సభ్యులుగా గోల్ల గోవర్ధన శర్మ, విశ్వనాథ శర్మ, డి.విజయకుమార్, ఆర్.విజయకుమార్ శర్మ, వి.మురళిధర్ శర్మ, సలహాదారులుగా డి.కృష్ణమూర్తి శర్మ, ఎన్.విశ్వమూర్తిశర్మ, వై.విఠల్‌శ్వర శర్మ ఎన్నికయ్యారు.

విద్యార్థులను పరామర్శించిన చనగాని దయాకర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 17న జరిగిన దాడిలో గాయపడిన శ్రీగాకాంత్ యాదవ్, చందులను టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ పరామర్శించారు. బుధవారం ఓయూ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, జరిగిన సంఘటన గురించి ఆరాతీసారు. నర్సింహ్మా, ఎన్ఎస్‌యూఐ ఓయూ ప్రసిడెంట్ శ్రీను, సురేష్, అభిలాష్ తదితరులున్నారు.

తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ఆవిర్భావం



పంజగుట్ట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరల అరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటుచేయాలని తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ఆవిర్భావ సభలో వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ఆవిర్భావ సభ బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ అధ్యక్షుడు చిట్యాల యాకయ్య అధ్యక్షత వహించారు. ఫౌండేషన్ నూతన కమిటీని ప్రకటించడంతో పాటు లోగోను ఆవిష్కరించారు. అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు, సీపీఐ రాష్ట్ర నాయకులు పశ్య పద్మ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజాలుపాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాన్ని ముందుండి నడిపి ఐలమ్మ అట్టడుగు వర్గాలకు బాసటగా నిలిచారన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు చిట్యాల యాకయ్య, కార్యక్రమంలో ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు పాల్గొన్నారు.

సమ్మెలో ఆరోగ్యశ్రీ సిబ్బంది

బంజారాహిల్స్: ఆరోగ్య మిత్రలను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆరోగ్య సిబ్బంది బుధవారం బంజారాహిల్స్‌లోని కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్ల పరిష్కారం జరిగే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జీఓ నెంబర్ 60 ప్రకారం నెలకు రూ.22,750లు వేతనం చెల్లించాలన్నారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్ సిబ్బంది గుర్తించాలన్నారు. తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరిస్తేనే విధుల్లో చేరతామని తేల్చిచెప్పారు.

శంకరమఠం.. చండీ హోమం



హోమం నిర్వహిస్తున్న పండితుడు శ్రీనివాస శర్మ

నల్లకుంట: పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం నల్లకుంట శంకరమఠం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా ముందుగా శక్తి గణపతికి ఆది పూజలు కావించి, చంద్రమౌళీశ్వర స్వామి, శారదామాతకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మఠం ప్రాంగణంలోని యాగశాలలో పండితుడు శ్రీనివాస శర్మ మంత్రోచ్చరణల నడుమ చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవధాన్యాలు, అమ్మవారికి సమర్పించిన వస్త్రాలు, పసుపు కుంకుమ, సుగంధ ద్రవ్యాలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి కావించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

చౌకబారు విమర్శలు మానుకోవాలి



నారాయణగూడ చౌరస్తాలో బీజేపీ నేత తన్వీందర్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్



ఇందిరాపార్కు చౌరస్తాలో బీజేపీ నేతల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

యువజన కాంగ్రెస్ నేత సంఘపాక వెంకట్

కవాడిగూడ: కేంద్ర రైల్వే సహాయ శాఖ మంత్రి రవనీత్ సింగ్ బిట్టూ రాహుల్ గాంధీకి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ముషీరాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంఘపాక వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ పిలుపులో భాగంగా ఇందిరాపార్కు చౌరస్తాలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పై బీజేపీ నేతలు చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షులు పాశం అనిల్ కుమార్ యాదవ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ, నాయకులు మేడి సురేష్, దేవి వరప్రసాద్, జాఫర్, బాబ్జీ, అఖిల్, అభిషేక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత తన్వీందర్ సింగ్ క్షమాపణ చెప్పాలి

కాచిగూడ: ఇందిరాగాంధీకి పట్టిన గతే రాహుల్‌గాంధీకి కూడా పడుతుందని బీజేపీ నేత తనీ్వందర్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు బుధవారం నారాయణగూడలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ డౌన్‌డౌన్ తన్వీందర్ సింగ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం నారాయణగూడ చౌరస్తాలో తన్వీందర్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ.. బీజేపీ నేతలు వెంటనే రాహుల్‌గాంధీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయాలన్నారు. ప్రజా సమస్యల గురించి మాట్లాడకుండా బీజేపీ నేతలు తమ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. రాహుల్‌గాంధీపై ఇకనైనా విమర్శలు మానుకోవాలన్నారు. లేదంటే బీజేపీ నేతలను రోడ్లపై తిరుగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అభిజిత్ యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అంశాలపై అవగాహన ఉండాలి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు రిజర్వ్ బ్యాంక్ సహకారంతో 'ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యత'పై బుధవారం అవగాహన తరగతులను నిర్వహించారు. ఆర్‌బీఐ ప్రతినిధి, గ్రేడ్ బీ అధికారిణి తాన్యా సంగ్మా హాజరై ఆర్థిక మార్పిడి విధానాలు, ఫెమా చట్టం, విద్యా లక్ష్మీ స్కీం, బ్యాంక్ అంబుడ్స్‌మెన్ చట్టం, పెట్టుబడిపై రూల్ 72 వంటి వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే అప్పుల నిర్వహణ, వడ్డీ రేట్లను అర్థం చేసుకోవడం, డబ్బును సంపాదించే ప్రక్రియలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్థిక అంశాలపై క్విజ్, చర్చలు కొనసాగాయి. యువకుల జీవితాలను ప్రభావితం చేసే ఆర్థిక వ్యవస్థల గురించి అవగాహన కల్పించడమే కాకుండా ఈ తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన సమాచారాన్ని అందించిందని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ నిర్వాహకులు తెలిపారు.

రైతుల సంక్షేమానికి కృషి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర సహకార సంఘం అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు అన్నారు. బుధవారం సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్ ఫార్మ్ రైస్డ్ వన్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్యాక్స్ శామీర్‌పేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెజిటేబుల్ కలెక్షన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో నష్టాల్లో ఉన్న సహకార అనుబంధ సంఘాలను తిరిగి లాభాల బాటలోకి నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో టెస్కాబ్ భాగస్వామ్యంతో ఫార్మ్ రైస్ వన్ వ్యవసాయ మార్పిడి వేదికను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, నాబార్డ్ సీజీఎం చింతల సుశీల, టెస్కాబ్ సీజీఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవం.. వీధులు ఆధ్యాత్మికం



సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం జరిగిన మహా పూర్ణాహుతి, సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి జరిగిన రథోత్సవ ఘట్టంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మికత వాతావరణం సంతరించుకుంది. జవహర్‌నగర్, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, వివేక్‌నగర్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీనివాసపురం వీధుల్లో రథోత్సవం కొనసాగింది. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ కాసుల రాధాకృష్ణశర్మ, ఈవో పి.లక్ష్మారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బీఎస్ శ్రీనివాస్‌రావుయాదవ్, ప్రభాకర్, కేబుల్ రాజు, ప్రభాకర్, అర్చకులు ఈ.కాశీనాథశర్మ, జగన్‌మోహనాచారి, భవనందశర్మ, గోపాలచారి, రామాచారి, నర్సింహమూర్తి, భక్త మండలి సభ్యులు మణి, రమణ, రామూర్తి, జి.గజానంద్, మురళీ, మంగ, శ్రీమాన్‌నారాయణ, గౌరరం శ్రీధర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు ఆశీర్వచనం అందజేస్తున్న బ్రహ్మ రాధాకృష్ణశర్మ, వేదపండితులు



చిక్కడపల్లి వీధుల్లో కొనసాగిన రథోత్సవంలో భక్తులు

ఓర్వలేకనే బీజేపీ, శివసేన నేతల విమర్శలు

● ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు



ముషీరాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బిజ్జి శత్రు

ముషీరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి దేశవ్యాప్తంగా ప్రజల్లో పెరుగుతున్న మద్దతుతో బీజేపీ, శివసేన నేతలకు మింగుడు పడకపోవడంతోనే విమర్శలు చేస్తున్నారని ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు అన్నారు. బుధవారం రాహుల్‌గాంధీపై బీజేపీ, శివసేన నేతల అనుచిత వాఖ్యలు చేసినందుకు ముషీరాబాద్ కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాహుల్‌గాంధీ పేద ప్రజలు, దళితులు, మహిళల సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నిస్తుండడంతో బీజేపీ నేతలు ఓర్వలేక పోతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ, శివసేన నేతలు విద్వేశపూరిత వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్నారని అన్నారు. రాహుల్‌గాంధీకి మరింత రక్షణ కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, శ్రీకాంత్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నాంపల్లి విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే కమల్ సింగ్(37) ధోబీ పని చేస్తుంటారు. బుధవారం తన నివాసంలో బట్టలను వాషింగ్ మెషిన్‌లో వేసి బట్టలు తీసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యారు. దీంతో అతడు తీవ్ర అస్వస్థతకు లోనై మృత్యువాతపడ్డారు. ఈ ఏడాదే అతడి భార్య సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.